క్లుప్తంగా

ఇంటర్ స్పోర్ట్స్ మీట్‌లో విద్యార్థుల ప్రతిభ


గెలుపొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కేశంపేట: హైదరాబాద్‌లోని హయత్‌నగర్‌లో ఇంటర్ స్పోర్ట్స్ మీట్‌లో మండల పరిధిలోని పాటిగడ్డ గ్రామంలో ఉన్న మేరీ ఇమ్మ్యాకులెట్ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. 800ల మీటర్ల రన్నింగ్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అశ్విత, పూజ, నందినిలు గెలుపొందినట్లు పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ షిజో తెలిపారు. అలాగే వివిధ విభాగాల్లో 4గోల్డ్, 6 సిల్వర్, 9 బ్రాస్‌మెడల్ పతకాలను సాధించినట్లు ఆమె చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ అనిత, శేఖర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా బీరప్ప జాతర


బీరప్ప జాతరలో పాల్గొన్న ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి

శంకర్‌పల్లి: మండలంలోని కొండకల్ గ్రామంలో సోమవారం బీరప్ప జాతర ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామంలో భక్తులతో కోలాహలం నెలకొంది. ప్రతి ఇంటి నుంచి బోనాలను సమర్పించారు. బీరప్ప జాతర కార్యక్రమంలో పోతురాజు విన్యాసాలు అందరిని ఆకట్టుకున్నాయి. కాగా, బీరప్ప జాతర కార్యక్రమంలో జిల్లా ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లావణ్య, ఎంపీటీసీ సురేందర్‌రెడ్డి, గుడిమల్కాపుర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్‌రెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.

కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయండి


మాట్లాడుతున్న హరినాథ్‌రెడ్డి

కొత్తూరు: హత్‌సే హత్‌జోడో సన్నాహక కార్యక్రమంలో భాగంగా నేడు (మంగళవారం)మండలంలోని జేపీదర్గా ఆవరణలో నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ కొత్తూరు మండల అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి తెలిపారు. సోమవారం పార్టీ కార్యాలయంలో పలువురు నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి శంకర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సమావేశానికి నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు తరలివచ్చి సమావేశం విజయవంతం చేయాలని కోరారు. రాహుల్‌గాంధీ పాదయాత్ర ముగింపు సందర్భంగా పార్టీ కార్యాలయం ఎదుట జాతీయజెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

అరిగోస సభకు తరలిన నాయకులు


అరిగోస సభకు తరలుతున్న నాయకులు

కొత్తూరు: హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద సోమవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన అనాథ పిల్లల అరిగోస దీక్షకు మండలం నుంచి ఎమ్మార్పీఎస్ నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పబ్బె జనార్దన్ మాట్లాడుతూ.. 2015లో సీఎం కేసీఆర్ అనాథ పిల్లల కోసం రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటుతో పాటు వారికి ఉచిత విద్యను అందిస్తామని ఇచ్చిన హామీని నేటికి అమలు చేయలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అనాథలను అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీశైలం, రవికుమార్, రమేష్, మైసయ్య, సత్తయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ వార్డు కమిటీ ఎన్నిక

షాద్‌నగర్: మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డులో కాంగ్రెస్‌పార్టీ పట్టణ అధ్యక్షుడు కొంకళ్ల చెన్నయ్య ఆధ్వర్యంలో సోమవారం వార్డు కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా శంకరయ్య, ఉపాధ్యక్షుడిగా విష్ణుమూర్తి, సయ్యద్‌యూసుఫ్, ప్రధాన కార్యదర్శిగా మహ్మద్ షకీల్‌అహ్మద్, సహాయ కార్యదర్శిగా నర్సింలు, శ్రీనివాస్, మోహన్, రాములు, జగదీష్‌చారి, రవీంద్రనాథ్, మస్తాన్, యాదయ్యయాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు రఘు, బాబర్‌అలీఖాన్, ఖదీర్, నరేష్, శ్రీకాంత్, సత్తయ్య పాల్గొన్నారు.

వాగులు ధ్వంసం

మట్టిని తరలిస్తున్న అక్రమార్కులు
- దారితప్పి ప్రవహిస్తున్న వరద నీరు


నందులకత్వ వాగులో అక్రమ తవ్వకాల వల్ల ఏర్పడిన గుంత(ఫైల్)

కొత్తూరు: ప్రకృతి సహజ సిద్ధంగా ఏర్పడిన వాగులు, పాటు కాల్వలు అక్రమ మట్టి వ్యాపారుల చేతుల్లో ఉనికి కోల్పోతున్నాయి. కొందరు వాగుల్లో నుంచి నల్లమట్టిని ఇటుకల బట్టీలకు మరికొందరు ఇసుక కోసం తవ్వకాలు జరుపుతున్నారు. దీంతో వర్షాకాలంలో భారీ వరదలు వచ్చినప్పుడు వాగుల గుండా కాకుండా దారి తప్పి ప్రవహిస్తున్నాయి. అక్రమ మట్టి వ్యాపారులపై రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు అడపదడపగా చర్యలు తీసుకుంటున్నప్పటికీ పూర్తిస్థాయిలో అరికట్టడంలో విఫలమవుతు న్నారు.

దారితప్పి పారుతున్న వరద నీరు..

మండలంలోని గూడూరు గ్రామం మీదుగా ఇబ్రహీంపట్నం వరకు విస్తరించిన నందులకత్వా వాగుకు ఎంతో చరిత్ర ఉంది. అంతటి చరిత్ర కలిగిన వాగును మట్టి వ్యాపారులు ధ్వంసం చేస్తున్నారు. దీంతో పాటు ఆయా చెరువులకు వరద నీటిని తరలించే ప్రధాన ఆదరువులైన వాగుల్లో మట్టి, ఇసుక కోసం రాత్రి వేళల్లో జేసీబీలతో తవ్వకాలు జరుపుతున్నారు. తవ్వకాల అనంతరం వ్యర్థం, రాళ్లుగా ఉన్న మట్టిని వాగులోనే పారబోస్తున్నారు. దీంతో భారీ వర్షాలు కురిసినప్పుడు వరద నీటి ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడుతున్నాయి. కొన్ని చోట్ల వరద నీరు దారి తప్పి వ్యవసాయ పొలాల గుండా పారుతున్నాయి.

చర్యలు నామమాత్రమే..

వాగులు, పాటు కాల్వల్లో అక్రమంగా తవ్వకాలు జరిపే వారిపై సంబంధిత అధికారులు నామమాత్రపు చర్యలు తీసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అందుకే వారు అదును చూసి యథేచ్ఛగా తిరిగి తవ్వకాలు జరుపుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. అనుమతులు లేకుండా తవ్వకాలు జరిపే వ్యాపారులు, వినియోగించే వాహనాలపై అధికారులు కఠిన చర్యలు తీసుకుంటేనే మట్టి త్రవకం ఆగుతుందని పలువురు పేర్కొంటున్నారు.

చర్యలు తీసుకుంటాం



వరద నీటిని చెరువులు, కుంటల్లోకి తరలించేందుకు ప్రకృతి సహజ సిద్ధంగా ఏర్పడిన వాగులు, పాటు కాల్వలను కాపాడుకోవాలి. అనుమతులు లేకుండా వాగులు, కాల్వల్లో తవ్వకాలు జరపడం నేరం. స్థానికులు, రైతులు అక్రమ తవ్వకాలు పాల్పడే వారి సమాచారాన్ని అధికారులకు చేరవేయాలి. విచారణ చేపట్టి వారిపై చర్యలు తీసుకుంటాం.

– రవీందర్, ఇరిగేషన్ ఏఈ, కొత్తూరు

వీర్లపల్లిలో తీరిన లోవోల్టేజీ సమస్య

నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు


వీర్లపల్లిలో ట్రాన్స్‌ఫార్మర్ బిగిస్తున్న అధికారులు

నందిగామ: కొంత కాలంగా లోహోల్టేజీ సమస్యతో సతమతమవుతున్న మండల పరిధిలోని వీర్లపల్లి దళితవాడ ప్రజలు, నూతనంగా సోమవారం ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రాములమ్మ మాట్లాడుతూ.. దళితవాడలో గత కొంత కాలంగా విద్యుత్ కనెక్షన్లకు సరిపడా ట్రాన్స్‌ఫార్మర్ లేక పోవడంతో హోల్టేజీ సమస్యతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఈ విషయమై ఏడీ రవీందర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు అంగీకరించడంతో సోమవారం ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించామని చెప్పారు. దీంతో గ్రామస్తులు సర్పంచ్ రాములమ్మతో పాటు విద్యుత్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు నర్సింహా, మల్లేష్, శ్రీశైలం, వెంకటేష్, మల్లేష్ పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు చూపే వరకు పోరాటం


తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

కొందుర్గు: పదేళ్ల క్రితం కొందుర్గు శివారులోని సర్వే నంబర్ 237 ఏనేగడ్డపై ఇళ్లు లేని నిరుపేదలకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలకు సంబంధించిన పట్టాలు ఇచ్చింది. ఈ స్థలాలు నేటికి వారికి స్వాధీనం చేయడం లేదని సీపీఐ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య ఆరోపించారు. సోమవారం కొందుర్గు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అప్పట్లో 74 మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వడం జరిగిందని, ప్రస్తుతం ఈ స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తులు ఆక్రమిస్తున్నారని, అయినా అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ.. పలుమార్లు సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టినా ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని లేనిచో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు వెంకటేష్, మండల సహాయ కార్యదర్శి చెన్నయ్య, నాయకులు బందెమ్మ, చెన్నయ్య, యాదమ్మ, లలిత, లక్ష్మి, సందమ్మ, పాండమ్మ, చిలకమ్మ పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులు మంజూరు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

కొత్తూరు: కొత్తగా ఏర్పడిన కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనుల నిమిత్తం మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ రూ.. 32.51కోట్ల నిధులను మంజూరు చేసినట్లు స్థానిక ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ తెలిపారు. ఇందులో భాగంగా ఆయన సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిధుల మంజూరుకు సంబంధించిన వివరాలను పాలకవర్గం సభ్యులకు వివరించారు. తనతో పాటు కౌన్సిలర్లు మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో పర్యటించి అక్కడ నెలకొన్న ప్రధాన సమస్యలను గుర్తించినట్లు తెలిపారు. పాలకవర్గం తీర్మానంతో అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా వార్డుల్లో చేపట్టే అభివృద్ధి పనులకు అందరు సహకరించాలని కోరారు. మంజూరైన నిధులతో సీసీరోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీతో పాటు పలు పనులు చేపట్టనున్నట్లు వివరించారు. ఇప్పటికే మున్సిపాలిటీలో సమీకృత మార్కెట్, నూతన మున్సిపల్ కార్యాలయ భవనాల నిర్మాణాలు జరుగుతున్నట్లు తెలిపారు. అనంతరం ఆయన హనుమాన్స్ ఆలయంలో నిర్వహిస్తున్న నవగ్రహ ప్రతిష్ఠలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషన్ వీరేందర్, వైస్ చైర్మన్ డోలి రవీందర్, కౌన్సిలర్లు మాదారం నర్సింహ్మాగౌడ్, సోమ్లానాయక్, నాయకులు దేవేందర్‌యాదవ్, సుదర్శన్‌గౌడ్, దేవేందర్ ముదిరాజ్, ఎమ్మె సత్యనారాయణ, లక్ష్మయ్య, జే. శ్రీను, రాజేందర్‌గౌడ్, గోవింద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ సిబ్బందిపై చర్యలకు డిమాండ్

చేవెళ్ల: బ్యాంక్ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఏటీఎంలో డబ్బులు డిపాజిట్ కాకపోగా తిరిగి చేతికి అందక పోవడంతో బాధితుడు బోరుమంటున్నాడు. వివరాలు ప్రకారం.. చేవెళ్ల మండల పరిధిలోని ఊరేళ్ల గ్రామానికి చెందిన గుట్లల రాజేందర్ చేవెళ్ల మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంక్ ఖాతా (62017998650 ద్వారా ఈ నెల 29వ తేదీన రాత్రి 9గంటల సమయంలో చేవెళ్ల ఎస్‌బీఐ ఏటీఎంలో కార్డులెస్ ద్వారా రూ. 49వేలు డిపాజిట్ చేశాడు. అయితే, డిపాజిట్ చేసిన డబ్బులు తను పంపిన వారికి జమ కాలేదు. దీంతో సోమవారం బాధితుడి రాజేందర్ ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్ శ్రీశిలాకు విషయం వివరించారు. డిపాజిట్ చేసిన డబ్బులు రావడానికి మరో 5రోజులు సమయం పడుతుందని ఆమె పేర్కొన్నారు. తమ బంధువులు ఆస్పత్రుల్లో ఉన్నందున అత్యవసరంగా ఏటీఎం ద్వారా కార్డ్‌లెస్ డిపాజిట్ చేయడం జరిగిందన్నారు. బ్యాంక్ సిబ్బంది సరియైన సమాధానం చెప్పడం లేదన్నారు. డిపాజిట్ కాని డబ్బులను నిబంధన ప్రకారం 24గంటల్లో అందించాల్సి ఉన్నా 5రోజులు పడుతుందని చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశాడు. పలు ఏటీఎం సెంటర్లో అనేక టెక్నికల్ సమస్యలు జరగుతున్నా బ్యాంకు అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఎంతో మందికి ఇటువంటి సంఘటనలు ఎదురవుతున్నాయని బ్యాంక్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

‘కంటివెలుగు’తో పేదలకు ప్రయోజనం

జెడ్పీటీసీ శ్రీలత


కంటివెలుగు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీలు

కొత్తూరు: అంధత్వ నివారణలో భాగంగా ప్రభుత్వం గ్రామాల్లో నిర్వహిస్తున్న కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ ఎమ్మె శ్రీలత కోరారు. సోమవారం ఆమె ఎంపీపీ మధుసూదన్‌రెడ్డితో కలిసి మండలంలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలో కంటివెలుగు కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రాథమిక దశలో కంటి జబ్బులను గుర్తించి సకాలంలో చికిత్సలు అందిస్తే అంధత్వం నుంచి కాపాడవచ్చనే సంకల్పంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. శిబిరాల్లో భాగంగా వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారికి ఉచితంగా కంటి అద్దాలు, మందులను పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ అజయ్‌నాయక్, ఉప సర్పంచ్ శ్రీరాములుయాదవ్, నాయకులు ఎమ్మె సత్యనారాయణ, లింగంనాయక్, వైద్యులు హరికిషన్ పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నిర్మూలనకు కృషి

డాక్టర్ నర్సింగ్‌రావు


ప్రతిజ్ఞ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మొయినాబాద్: కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్క రు సహకరించాలని మొయినాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ నర్సింగ్‌రావు పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని చిలుకూరు గ్రామ పంచాయతీలో ప్రపంచ (లెప్రసి) కుష్టు వ్యాధి దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. శరీరంపై ఎటు వంటి మచ్చలు ఏర్పడినా వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు. శరీర స్పర్శ లేకున్నా అనారోగ్య సమస్యలు ఎదురవుతాయన్నారు. కాగా, కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వరూప, సిబ్బంది పాల్గొన్నారు.

పాడి పశువులను కాపాడుకోవాలి

- పశువైద్య అధికారి దేవిరెడ్డి
- గ్రామాల్లో ఆవులు, గేదెలకు బ్రూసెల్లోసిస్ టీకాలు


పశువులకు టీకాలు వేస్తున్న అధికారి దేవిరెడ్డి

మొయినాబాద్‌రూరల్: పాడి పశువుల రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అధికారుల సూచనలు, సలహాలు పాటించాలని అమ్డాపూర్ పశువైద్య అధికారి దేవిరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో పశువులకు బ్రూ సెలోసిస్ వ్యాధి నివారణ టీకాలను ప్రభుత్వం ద్వారా ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో పాడి పశువుల రైతులు ప్రభుత్వం అందజేస్తున్న బ్రూసెలోసిస్ వ్యాధి నివారణ టీకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యాధి నివారణ టీకాలు పశువులు ఆరోగ్యంగా ఉండేందుకే ప్రభుత్వం ఎప్పటికప్పుడు రైతులకు సూచనలు, సలహాలు అందజేస్తున్నాయన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న సూచనలు, సలహాలతో పాటు పంపిణీ చేస్తున్న టీకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో అమ్డాపూర్ పశువైద్య అధికారులు శివ, రవి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల వారీగా...

ఈ నెల 31వ తేదీన బాకారం, కాసీంబౌలి, ఫిబ్రవరి 1వ తేదీన శ్రీరామ్‌నగర్, ఫిబ్రవరి 2వ తేదీన నక్కలపల్లి, ఎత్‌మార్‌పల్లి, 3వ తేదీన కేతిరెడ్డిపల్లి, వెంకటాపూర్, 4వ తేదీన కనకమామిడి, అప్పారెడ్డిగూడ, 5వ తేదీన చాకలిగూడ ఆయా గ్రామాల్లో తేదీల వారీగా టీకాలు వేయడం జరుగుతుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆర్టీసీలో సురక్షిత ప్రయాణం

షాద్‌నగర్ డిపో మేనేజర్ ఉష


గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

కేశంపేట: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితంగా ఉంటుందని షాద్‌నగర్ డిపో మేనేజర్ ఉష అన్నారు. మండల పరిధిలోని ఇప్పలపల్లి గ్రామంలో ప్రజల వద్దకు ఆర్టీసీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న షాద్‌నగర్ ఆర్టీసీ డిపో మేనేజర్ ఉష మాట్లాడుతూ... ఆర్టీసీ బస్సుల్లో డ్రైవర్లకు పూర్తిస్థాయిలో డ్రైవింగ్‌పైన అవగాహన ఉంటుందన్నారు. ఆర్టీసీ బస్సులు సమయపాలనలో నడుస్తున్నాయని ప్రైవేట్ వాహనాల్లో కాకుండా ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని ఆమె అన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణీకులకు ప్రభుత్వం రాయితీలను ఇస్తుందని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని ఆమె అన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆంజనేయులు, డిపో అసిస్టెంట్ మేనేజర్ ఆనందరావు, వెంకటేష్, అర్జున్, భూషన్, పంచాయతీ కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

మహాత్ముడి ఆశయాలను కొనసాగిద్దాం

గ్రంథాలయ కమిటీ చైర్మన్ లక్ష్మీనర్సింహారెడ్డి

షాద్‌నగర్ రూరల్: స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీజీ అనుసరించిన శాంతి, సహనం, సోదర భావాన్ని ప్రతిఒక్కరు అలవర్చుకొని మహాత్ముని ఆశయాలను కొనసాగిద్దామని గ్రంథాలయ కమిటీ చైర్మన్ లక్ష్మీనర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని పట్టణంలోని గ్రంథాలయంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ వైస్ చైర్మన్ అరుణ, శేఖర్, ఆర్లయాదయ్య పాల్గొన్నారు.

కాశిరెడ్డిగూడలో

మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా మండల పరిధిలోని కాశిరెడ్డిగూడలో సర్పంచ్ దీనాశంకర్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాలువేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ శంకర్‌రాథోడ్, రేణుక, హరి, ఇబ్రహీం, భానుచంద్ర పాల్గొన్నారు.

వాసవి, వనితా క్లబ్ ఆధ్వర్యంలో

గాంధీజీ వర్ధంతిని వాసవి, వనితాక్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని కన్యకాపరమేశ్వరీ దేవాలయం ఎదురుగా ఉన్న మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ అధ్యక్షుడు నవీన్‌కుమార్, వెంకటరమణ, వినోద్‌కుమార్, సంగీత, లావణ్య, రమేష్, శిధర్, ఆనంద్, నాగరాజు, శ్రీనివాస్, వెంకటేష్, నరేందర్, లావణ్య, మాధవి పాల్గొన్నారు.

గాంధీ విగ్రహానికి నివాళి

కొందుర్గు: బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లేడ్ చౌదరిగూడ మండలం చౌదరిగూడ ఉన్నత పాఠశాల ఆవరణలోని గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సయ్యద్ హఫీజ్ మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం సాధించిపెట్టిన మహాత్ముడి కలను ముఖ్యమంత్రి కేసీఆర్ నిజం చేస్తున్నాడన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు స్వామి, అక్రమ్, రాములు, ఇస్మాయిల్, వెంకటేష్, మాణయ్య, బాల్‌చంద్రయ్య, బాలయ్య పాల్గొన్నారు.

ఘనంగా గాంధీ వర్ధంతి వేడుకలు

కేశంపేట: జాతీపిత మహాత్మాగాంధీ 75వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయా గ్రామాల్లో యువకులు, యువజన సంఘాల సభ్యులు, ప్రజాప్రతినిధులు గాంధీజీ చిత్రపటానికి, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో మనోహర్‌గౌడ్, శ్రీశైలం, జహంగీర్ బాబా, మణి, గణేశ్, శేఖర్, నర్సింహ, బ్రహ్మచారి, మహేందర్ పాల్గొన్నారు.


షాద్‌నగర్ రూరల్: గాంధీజీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

బ్యాంకు సేవలను వినియోగించుకోండి

ఏపీజీవీబీ మేనేజర్ రాములు


సదస్సులో మాట్లాడుతున్న మేనేజర్

నందిగామ: మహిళలు, పరిసర గ్రామాల ప్రజలు గ్రామీణ వికాస్ బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఆ బ్యాంకు నందిగామ బ్రాంచ్ మేనేజర్ రాములు సూచించారు. మండల కేంద్రమైన నందిగామలోని ఏపీజీవీబీ బ్యాంకు ఆవరణలో సోమవారం మహిళ సంఘాల సభ్యులకు రుణాలు, చెల్లింపులు తదితర అంశాలపై అవగహన కల్పించారు. ఈ సందర్భంగా మేనేజర్ రాములు మాట్లాడుతూ.. మహిళ సంఘాల్లోని ప్రతి సభ్యురాలికి మహిళ వ్యాపార వృద్ధి పథకం ద్వారా రూ. 20 వేల రుణం ఇవ్వనున్నట్లు తెలిపారు. మహిళలు బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకొని వ్యాపార రంగంలో ముందుకు సాగాలని సూచించారు. బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లించినట్లయితే అటు బ్యాంకుకు ఇటు ఖాతా దారులకు బాగుంటుందని వివరించారు. కార్యక్రమంలో ఏపీఎం యాదగిరి, సీసీలు అనురాధ,రజిని, మహిళ సంఘం సభ్యులు పాల్గొన్నారు.